క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


పనులు చేస్తున్న కూలీలు

అనుమసముద్రంపేట: మండలంలోని చందులూరుపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఉపాధి హామీ పనులకు కూలీలు ఎక్కువ మంది వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. పనుల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పనులు చేయించేలా ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు చొరవ చూపాలని తెలిపారు. రోజు కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేసుకోవాలన్నారు. పనులు జరిగే ప్రాంతంలో కూలీలకు మౌలిక వసతులు కల్పించేలా ఉపాధి సిబ్బంది అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏపీఓ నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

మేత పోరంబోకు భూములకు పట్టాలివ్వం


భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

పొదలకూరు: మేత పోరంబోకు భూములకు రెవెన్యూ శాఖ పట్టాలివ్వదని, సదరు భూములు ఆయా పంచాయతీల ఆధీనంలోనే ఉంటాయని తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని సూరాయపాళెంలో మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారనే ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 352లోని మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయని చెప్పారు. సదరు భూములు రూ.కోట్ల మేర విలువజేస్తాయనడంలో వాస్తవం లేదన్నారు. తాను తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టక ముందు నుంచే భూములను సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ భూములకు పట్టాలను అందజేయమని స్పష్టం చేశారు. ఆక్రమణకు గురైన భూముల విషయమై పంచాయతీ నిర్వాహకులు లేఖ రాస్తే తొలగించి అప్పగిస్తామని చెప్పారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ నవీన్, వీఆర్వో రాగయ్య, సర్పంచ్ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్వామిత్వ రీసర్వే


సర్వేను పరిశీలిస్తున్న రమణయ్య

మనుబోలు: మండలంలో స్వామిత్వ రీసర్వే ముమ్మరంగా జరుగుతోంది. అక్కంపేటలో రీసర్వేను పంచాయతీ విస్తరణాధికారి రమణయ్య మంగళవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా పంచాయతీల పరిధిలోని గ్రామ కంఠంలో గల ప్రతి ఇంటినీ రీసర్వే చేసి యజమానులకు హక్కు పత్రాలను ఇవ్వనున్నారని చెప్పారు. రీసర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు సుమంతి, అంకబాబు, సచివాలయ సర్వేయర్లు వెంకమ్మ, మధు, రాజశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికంఠ, డిజిటల్ అసిస్టెంట్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు నోరు అదుపులో పెట్టుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): టీడీపీ కార్యకర్తలు నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు హితవు పలికారు. విడవలూరులోని పార్టీ నేత అచ్యుత్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. కొడవలూరు మండలంలోని మానేగుంటపాడుకు చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు విడవలూరుకు చెందిన అదే పార్టీ కార్యకర్తను విమర్శిస్తూ సోషల్ మీడియాలో ఆడియోను వైరల్ చేశారని తెలిపారు. ఈ విషయంతో సంబంధం లేని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని టీడీపీ కార్యకర్తలు విమర్శించడం దారుణమన్నారు. సోషల్ మీడియాలో విమర్శలు చేస్తూ పోస్టులు పెట్టిన వారిని వదిలేసి తమ పార్టీ నేతలను విమర్శించడం తగదని సూచించారు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వద్ద జీతానికి పని చేసే వ్యక్తి.. ఎమ్మెల్యేను విమర్శించడం తగదన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, నేతలు విజయభాను రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తిరుపతి, శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


ఎస్వీపాళెంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోగోలు మండలం శ్రీవెంకటేశ్వరపాళెం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు, గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులపై గ్రామస్తులతో చర్చించారు. ఈ క్రమంలో స్థానిక విద్యార్థులు గ్రామంలోకి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా ఆర్టీసీ బస్సును నడపాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు కూడా వెంటనే అంగీకరించడంతో విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక పేదలకు అండగా నిలిచేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. పాలనను ప్రజలకు చేరువ చేసేలా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. అలాగే పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, ఇంటి వద్దకే పింఛన్లు, రైతుభరోసా కేంద్రాలు, అమ్మఒడి తదితర పథకాలు అమలు చేస్తున్నారని, ఈ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిబోయిన వీరరఘు, సర్పంచ్ ద్వారం వెంగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ యానాదిరెడ్డి, నాయకులు ద్వారం వేణుగోపాల్, వెంకట సుబ్బారెడ్డి, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్లు, మత్స్యకార నాయకుడు గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ కిరణ్ తదితరులు

వరికుంటపాడు: మండలంలో పంటలు సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి జి.కిరణ్ సూచించారు. మంగళవారం స్థానిక రైతుభరోసా కేంద్రం పరిధిలో సాగులో ఉన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు తలమాడు తెగులు సోకిందని, ఫలితంగా ఆకుల చివర్లు పసుపు రంగులోకి మారి చిన్నవిగా ఉంటాయని తెలిపారు. అలాగే వరి పంటకు ఆకుముడత తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. తెగుళ్ల నివారణకు ఏఏ మందులు పిచికారీ చేయాలో వివరించారు. ఆయన వెంట వీఏఏ చంద్రశేఖర్, రైతులు ఉన్నారు.

నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

అనుమసముద్రంపేట: మండలంలోని గుడిపాడు సచివాలయం పరిధిలో బుధ, గురువారాల్లో, 22వ తేదీ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం తెలిపారు. గుడిపాడు సచివాలయం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే మేకపాటి పర్యటిస్తారని, ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు ఉపాధి ప్రజావేదిక

ఉదయగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2020 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు అధికారులు తనిఖీలు నిర్వహించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన అంశాలపై ప్రజావేదికలో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

సమయపాలనపై చర్యలు తీసుకోండి


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న డీడీఓ

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు, మన ఫౌండేషన్ సభ్యులు మంగళవారం ఆ వైద్యశాలలో డీడీఓ లీలావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి పరిసర ప్రాంతాల్లోని పేద ప్రజలు అనారోగ్యం బారిన పడితే ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎక్కువ శాతం మంది ప్రజలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యసేవల కోసం వస్తుంటారని తెలిపారు. అయితే వైద్యశాలలో పనిచేసే వైద్యులు సమయపాలన పాటించకపోతుండడంతో రోగులు వేచిచూడాల్సి వస్తోందన్నారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటిస్తూ సక్రమంగా వైద్యసేవలు అందించేలా చూడాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం, మన ఫౌండేషన్ నాయకులు ఫరిద్దీన్‌బాషా, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆదిరెడ్డి

వరికుంటపాడు: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడా స్ఫూర్తిని యువత పెంపొందించుకోవాలని బొడ్డు లక్ష్మమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిగ్‌బాస్–6 కంటెస్టెంట్ ఆదిరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని మంగళవారం ఆయన వరికుంటపాడులో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా పరంధామిరెడ్డి, నితీష్‌రెడ్డి, మనోహర్, నిఖిల్, మధు, విష్ణు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు


విజేతలతో నిర్వాహకులు

మర్రిపాడు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని డీసీపల్లి, చుంచులూరు గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. సోమవారం రాత్రి చుంచులూరులో విజేత జట్టుకు నిర్వాహకుడు సుబ్బరాజు, సీఐ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసరాజు బహుమతులు అందజేశారు. డీసీపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు చింతలపల్లి మధుసూదనశాస్త్రి, చిలకా వెంకటరెడ్డి బహుమతులు అందజేశారు. డీసీపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 25 టీంలు పాల్గొన్నాయి. వారిలో డీసీపల్లి హోం టీం విజేతగా నిలవగా, ఫ్రెండ్స్ ఫరెవర్ జట్టు రన్నర్‌గా నిలిచింది.

వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం


యానాదిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన సోమవరపు యానాదిరెడ్డిని నియమించడంతో ఆయనను పలువురు అభినందించి ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆయన నివాసంలో పలువురు బీజేపీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు మంగళవారం యానాదిరెడ్డిని కలిశారు. ఆధ్యాత్మిక భావాలు ఉన్న ఆయనకు వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్ష పదవి రావడం సంతోషకరన్నారు. కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, కంచి పరమేశ్వరరెడ్డి, కేవీ శేషారెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, ప్రసాదురెడ్డి, ఏలూరు రాజగోపాల్‌రెడ్డి, సుసర్ల రమణయ్య, నారాయణరావు, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లికి వైభవంగా గ్రామోత్సవం


పోలేరమ్మతల్లిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో వెలసిన పోలేరమ్మతల్లికి సోమవారం అర్ధరాత్రి గ్రామస్తులు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలేరమ్మతల్లి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పోలేరమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బీసీసీఏ టోర్నమెంట్ విజేత బీసీకాలనీ జట్టు


విజేతగా నిలిచిన బీసీకాలనీ జట్టు


విజేత జనార్దనపురం జట్టు

వింజమూరు: బీసీకాలనీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వింజమూరులో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో బీసీకాలనీ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో బీసీకాలనీ జట్టు – గొట్టిగుండాల జట్టుపై విజయం సాధించింది. బీసీ కాలనీ జట్టు విజేతగా, గొట్టిగుండాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సాయికృష్ణ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మోహన్‌రావు, బెస్ట్ బౌలర్‌గా పద్మారెడ్డి, బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా చింటు నిలిచారని తెలిపారు. విజేత జట్టుకు షీల్డ్, కప్‌ను సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, ఎస్సై జంపానికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి చేతులమీదుగా అందజేశారు.

జనార్దనపురంలో..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని జనార్దనపురంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలు మంగళవారం ముగియగా విజేతగా జనార్దనపురం జట్టు, రన్నర్‌గా గరిమెనపెంట జట్టు నిలిచాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు.

నిందితుల బైండోవర్


నిందితులను బైండోవర్ చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

అల్లూరు: మండల పరిధిలో గతంలో నాటుసారా, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీరామకృష్ణ సమక్షంలో బైండోవర్ చేసినట్లు కోవూరు ఎస్ఈబీ సీఐ నరహరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి కేసులో నిందితుడుగా ఉన్న ఇస్కపల్లిపాళేనికి చెందిన ప్రళయకావేరి తాతయ్య, వైకుంఠపురానికి చెందిన గోళ్లపల్లి రమణమ్మ, నాటుసారా కేసులో నిందితులైన చవటపాళేనికి చెందిన కామంచి ఏసోబు, వైకుంఠపురానికి చెందిన కావడి శివలను ఏడాది కాలపరిమితితో రూ.2 లక్షల పూచీకత్తుతో తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు తెలిపారు. అల్లూరు మండలంలో ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 14500 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై టి.శ్రీహరి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పొదలకూరు: నాటుసారా రహిత గ్రామాలుగా బిరదవోలు, బ్రాహ్మణపల్లి గుర్తింపు పొందాలని, సారా తయారు చేసినా.. తాగినా తీవ్ర పరిణామాలు తప్పవని బిరదవోలు దత్తత అధికారి, నెల్లూరు ఎస్ఈబీ సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జేడీ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు బిరదవోలు సచివాలయం, బ్రాహ్మణపల్లి పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. సారా కేంద్రాలపై మహిళలు నిఘా ఉంచి సమాచారం అందించాలని కోరారు. ఇతర పనులు చేసుకొని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. సారాను తయారు చేస్తున్న గ్రామాలను దత్తత తీసుకొని.. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎస్ఈబీ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారని పేర్కొన్నారు. ఎస్ఈబీ పొదలకూరు ఇన్‌చార్జి సీఐ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ

• అమాంతం పెంచిన టికెట్ ధరలు
• నిద్రమత్తులో ఆర్టీసీ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గా నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు టిక్కెట్ల ధరలు మంగళవారం అమాంతం పెంచేశారు. ప్రయాణికులను ముక్కుపిండి వసూలు చేస్తున్న ఈ ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రయాణికులు ఆరోపించారు. గతంలో ఏఎస్‌పేట నుంచి హైదరాబాద్‌కు ఆరు ఆర్టీసీ సెమీ లగ్జరీ బస్సులు ఉండేవి. అయితే ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు దాదాపు 8 బస్సులు హైదరాబాద్‌కు తిప్పుతుండడంతో ఆర్టీసీ బస్సులను పూర్తి స్థాయిలో అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు సిండికేట్‌గా మారి ప్రయాణికుల జేబులు కొల్లగొడుతున్నారు. దీంతో అటు రవాణాశాఖ, ఇటు ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులపై మండలవాసులు విమర్శలకు దిగుతున్నారు. దీనికితోడు తనిఖీలు నిర్వహించాల్సిన ఆత్మకూరు ఎంవీఐ సైతం నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా ఇళ్లకు వచ్చి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన ప్రయాణికుల నుంచి మంగళవారం రూ.2 వేల వరకు టిక్కెట్ ధర వసూలు చేశారు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పలువురు రైలులో వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ ట్రావెల్స్ ఆగడాలపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన నూతన విద్యుత్ టారిఫ్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు విద్యుత్ డీఈఈ బి.జనార్దన్ తెలిపారు. మంగళవారం ఆయన ఆత్మకూరులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. 19, 20, 21 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. నూతన టారిఫ్‌పై జరిగే ఈ అభిప్రాయ సేకరణలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

వ్యక్తిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలో గల శంకర్‌నగర్ కాలనీ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై ఆనంద్‌భాస్కర్‌బాబు వివరాల మేరకు.. శంకర్‌నగర్ కాలనీకి చెందిన ఓ యువతి స్థానికంగా పానీపూరి తింటుండగా, కంచరపాళేనికి చెందిన ఉదయ్ ఆమెతో అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో విషయాన్ని తన బంధువైన దయాకర్‌కు యువతి తెలియజేశారు. ఘటన స్థలానికి వచ్చిన ఆయనకు అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో కంచరపాళేనికి చెందిన పెద్దలకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేశారు. అనంతరం అక్కడి పెద్దలు తమ కాలనీకి చెందిన ఉదయ్‌ను మందలించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఉదయ్ తన స్నేహితులైన ప్రసాద్, రవితో పాటు మరో ఐదుగురితో శంకర్‌నగర్ కాలనీకి వచ్చారు. అక్కడ పానీపూరి బండిపై ఉన్న స్టౌతో దయాకర్‌పై దాడి చేశారు. ప్రమాదంలో దయాకర్ కాలికి గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న జీజే రావు

ముత్తుకూరు: జీవితం.. విధి నిర్వహణలో భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు పేర్కొన్నారు. భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జీవితంలో అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం భద్రతపై ఆన్‌లైన్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పోర్టు ఆపరేషన్స్ హెడ్ మోహిత్, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, దివ్య ప్రణీత్, మనోహర్‌బాబు, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.